# రాజధానిలో ఇండియన్ రోడ్ కాంగ్రెస్

- డిసెంబరు 15 నుంచి నాలుగు రోజుల సదస్సు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- దెబ్బతిన్న జాతీయ రహదారుల మరమ్మతులకు ఆదేశాలు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఈనాడు, హైదరాబాద్:** రహదారుల నిర్మాణానికి మార్గదర్శిగా ఉన్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. డిసెంబరు 15 నుంచి 18 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ చేపట్టిన పనుల పురోగతిపై శుక్రవారం ఆయన సచివాలయంలో సమీక్షించారు. 'ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సును ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా సుమారు ఐదువేల ఇంజినీరింగ్ నిపుణులు దీనికి హాజరవుతారు. ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న మార్పులపై మేథోమథనం జరిపి భవిష్యత్తు మార్గదర్శకాల రూపకల్పనకు ఈ సదస్సు బీజం వేస్తుంది. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో రహదారుల నిర్మాణంలో జాతీయ, అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై రాష్ట్ర ఇంజినీర్లు మరింత అవగాహన కలిగించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహించేందుకు నిర్ణయించింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణ వ్యవస్థ, ఇంటిలిజెంట్ రవాణా విధానాలు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై కూడా ఈ సదస్సులో చర్చిస్తారు. అత్యున్నత ప్రమాణాలతో ఈ సదస్సు నిర్వహణకు ప్రణాళికలను రూపొందించాలి.

**కేంద్రానికి అప్పగించేంత వరకు నిర్వహణ మనదే:** 2,600 కిలోమీటర్ల మేరకు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా కేంద్రం ప్రకటించింది. ఆ రహదారులు కేంద్రానికి అప్పగించేంత వరకు వాటి బాగోగులను రహదారులు, భవనాల శాఖే చూడాలి. ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న జాతీయ రహదారులకు మరమ్మతులు చేపట్టాలి. 319 వంతెనల నిర్మాణం చేపట్టగా ఇప్పటికి 30 మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణంలో ఉన్న 188 వంతెనల పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. మిగిలిన 101 వంతెనల నిర్మాణం ప్రారంభించడంపై శ్రద్ధ చూపాలి. నాబార్డు మంజూరు చేసిన గ్రామీణ రహదారుల పనులను త్వరితంగా పూర్తి చేయాలి' అని తుమ్మల ఆదేశించారు.

**మెట్రోరైల్ అధికారులతో సమావేశం:** హైదరాబాద్‌లో మెట్రో రైలు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రోడ్లు భారీగా దెబ్బతిన్న అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రాధాన్యతాక్రమంలో వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. దీనిపై జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో రైలు అధికారులతో తక్షణం సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రహదారులు, భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, ఇంజినీరింగ్ అధికారులు రవీందర్‌రావు, బిక్షపతి, గణపతిరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.